హైదరాబాద్ వార్త



# మాకు ఫారాలు అందలే...!

* బస్తీలు, కాలనీల్లో కనిపించని బిఎల్‌వోలు
* నేతల ఇళ్లు, కమ్యూనిటీ హాళ్ల వద్దే హడావిడి
* అక్కడి నుంచి ఎన్యూమరేషన్‌ఫాంలు అందజేత
* అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) హైదరాబాద్ జిల్లాలో ఇష్టారాజ్యంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని 15 అసెంబ్లీ నియోజక వర్గాల్లో బూత్‌ల వారీగా నియమితులైన మొత్తం 4062 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు తమకు కేటాయించిన పోలింగ్ బూత్ పరిధిలోని అన్ని ఇళ్లకు వెళ్లి ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని, ప్రతి ఒక బూత్ లెవెల్ ఆఫీసర్ ఈ నెల 24వ తేదీలోపు ఒక ఇంటిని మూడుసార్లు సందర్శించి సేకరించిన ఫారాలను అదేరోజున తమకు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించినా, ఆ ఆదేశాలు క్షేత్ర స్థాయిలో ఎక్కడా అమలు కావటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బూత్ లెవెల్ ఆఫీసర్లలో సగం మంది ఇంటింటికి వెళ్లకుండా, స్థానికంగా ఉన్న పొలిటికల్ లీడర్ల ఇళ్లల్లో, సమీపంలోని కమ్యూనిటీ హాళ్లలో కౌంటర్లను ఏర్పాటు చేసిన ఓటర్లను అక్కడికే పిలిపించుకుంటున్నట్లు తెలుస్తోంది. బిఎల్‌వోలు ప్రతి ఇంటిని మూడుసార్లు సందర్శించాలని, మొదటిసారి ఫారాల పంపిణీకి, రెండోసారి ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు మూడోసారి పూరించిన ఫారాలను కలెక్ట్‌చేసుకునేందుకు మొత్తం మూడుసార్లు సందర్శించాల్సి ఉంటుంది. కానీ సిటీలోని సనత్‌నగర్, సికిందరాబాద్, ముషీరాబాద్, జూబ్లీహిల్స్, అంబర్‌పేట, ఖైరతాబాద్ వంటి నియోజకవర్గాల్లోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే బీఎల్‌ఓలు ఓ దఫా ఇంటింటిని సందర్శించి ఫారాలను అందించగా, మిగిలిన నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు కమ్యూనిటీ హాళ్లలో, లీడర్ల ఇళ్ల వద్ద తిష్టవేసి, అక్కడికే ఓటర్లను పిలిపించుకుంటున్నారు. మరి కొందరు బీఎల్‌ఓలు ఫారాల పంపిణీ, కలెక్ట్‌చేసుకునే మొత్తం బాధ్యతలను బూత్ లెవెల్ పొలిటికల్ ఏజెంట్లకు అప్పగించినట్లు తెలుస్తుంది.

**ఓటర్లకు సహకరించని బిఎల్‌వోలు..**

బోగస్ ఓట్లను ఏరివేసేందుకు నిర్వహిస్తున్న సర్ ప్రక్రియలో రాజకీయ జోక్యం ఎక్కువ కావటంతో వాటి ఏరివేత ఎన్నికల సంఘం ఆశించిన స్థాయిలో జరగటం లేదని, లీడర్లు తమకు నచ్చిన ఓటర్ల సర్ వివరాలను సమకూర్చటం, తమ ఓటు బ్యాంకును కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇందుకు సిటీలో ప్రాబల్యం ఉన్న కొన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో సర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి తేదీని ఖరారు చేసిన వెంటనే తమ ఓటు బ్యాంకుకు సంబంధించిన సర్ 2002 వివరాలను సేకరించి, సమర్పించేందుకు అన్నిరకాల ఏర్పాట్లను చేసుకున్నట్లు సమాచారం. ఒక్కో బూత్ లెవెల్ ఆఫీసర్ తనకు కేటాయించి పోలింగ్‌స్టేషన్ పరిధిలోని ఒక్కో ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫారాలను అందించాల్సి ఉండగా, కొందరు బీఎల్‌ఓలు ఒకటి ఇచ్చి, దాన్ని జిరాక్స్ చేసుకోవాలని సూచిస్తున్నట్లు ఓటర్లు వాపోతున్నారు. ఒక్కో ఓటరుకు ఫారాలను అందించిన తర్వాత ఫారాన్ని పూరించటంలో, 2002 సర్ లో ఓటరు వివరాలను ప్రస్తుతం ఇచ్చిన ఫారంలో వివరాలు పొందుపరిచేందుకు ఓటరుకు సహకరించాల్సిన బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్లకు సహకరించటం లేదని ఆరోపణలున్నాయి.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

* నగరంలోని బస్తీ దవాఖానాల్లో తనిఖీలు
* ప్రత్యేక అధికారులుగా కలెక్టర్, జిహెచ్‌ఎంసి కమిషనర్
* ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త:** జిల్లా పరిధిలోని 169 బస్తీదవాఖానల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్యసేవల నాణ్యతను ఈనెల 10వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తనిఖీలను సమన్వయం చేస్తూ తనతోపాటు జీహెచ్ఎంసీకమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా రాబోయే రెండు మూడు రోజుల పాటు ముఖ్యమైన బస్తీ దవాఖానలను తనిఖీలు చేస్తామని వెల్లడించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్‌జ్వరాలువంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు బస్తీ దవాఖానలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అలాగే మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బస్తీ దవాఖానలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రతిబస్తీ దవాఖాన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలి అని సూచించారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తమ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానలను స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లు అలాగే ఇతర ప్రజాప్రతినిధులు విధిగా సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులతో సమన్వయం చేయాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, బస్తీ దవాఖానలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు నిరంతరం కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## క్యాన్సర్ పేరుతో రూ. 6.50 కోట్లు కాజేశారు

**- దంపతులపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, జూలై 9, ప్రభాతవార్త :** క్యాన్సర్ చికిత్స పేరుతో రూ. 6.5 కోట్లు కాజేసిన దంపతులపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం..వాసిరెడ్డి స్వాతి, భర్త సుజీత్‌లు క్యాన్సర్ చికిత్స పేరుతో ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్‌నగర్‌కు చెందిన బిల్డర్ మల్లి రామకృష్ణారెడ్డి(55) భార్య నుంచి పలు దఫాలుగా రూ. 6.5 కోట్లు తీసుకున్నారు. ఆమొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని లేదంటే బంగారం లేదా భూమిని ఇస్తామని నమ్మించారు. తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వకుండా, అడిగితే ఆత్మహత్య కేసులో ఇరికిస్తామని, సూసైడ్‌నోట్ రాస్తామని బెదిరించారు.తీసుకున్న డబ్బుతో భూములు, బంగారం, కారు తదితర ఆస్తులను కుటుంబసభ్యుల పేర్లపై కొనుగోలుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగాల పేరుతో మోసాలు

**జేబ్లీహిల్స్, జూలై 9, ప్రభాతవార్త :** రైల్వే ఉద్యోగం పేరుతో ఒకరు, విదేశాల్లో ఉద్యోగం పేరుతో మరొకరు మోసాలకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌కు చెందిన రమ్యప్రియ(32) మేనమామ ద్వారా పరిచయమైన జూబ్లీహిల్స్‌కు చెందిన వాచ్‌మెన్ రామాంజి తన పలుకుబడితో రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని, రూ.20 లక్షలు ఖర్చవుతుందని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాధితురాలు 2023 జూలైలో ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు చెల్లించింది. డబ్బు తీసుకొని మూడేళ్లు అయినా కాలయాపన చేస్తూ వచ్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సంఘటనలో...**

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి రూ.4.65 లక్షలు వసూలు చేసిన ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ ప్రతినిధులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన గోపాలభట్ల శ్రీనివాస్ (46) ఔరెన్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ ప్రతినిధులు దీప్తి, రూఫస్ కార్తీక్‌లు ఫిజీలో ఉద్యోగం, వర్క్ పర్మిట్, వసతి తదితర సౌకర్యాలు కల్పిస్తామని నమ్మించారు. దీంతో ఫిబ్రవరిలో రూ.4.65 లక్షలు చెల్లించాడు. అనంతరం విజిటర్ వీసాపై ఫిజీకి పంపించి, 20 పని దినాల్లో వర్క్ పర్మిట్‌గా మారుస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఉద్యోగం, వర్క్ పర్మిట్ కల్పించలేదు. దీంతో ఫిజీలో ఉండేందుకు సుమారు రూ.2.60 లక్షలు, తిరిగి హైదరాబాద్‌కు రావడానికి మరో రూ.60 వేల వరకు అదనపు ఖర్చు అయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బు తిరిగి ఇవ్వకపోగా, ఫోన్ కాల్స్, సందేశాలకు కూడా స్పందించకుండా మోసం చేశారని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న అయిదుగురు అరెస్ట్

**- 5 కిలోల గంజాయి స్వాధీనం**

**జూబ్లీహిల్స్, జూలై 9, ప్రభాతవార్త :** గంజాయిని గ్రాముల్లోకి మార్చి విక్రయించేందుకు ప్రయత్నించిన అయిదుగురిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి వారినుంచి అయిదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం..కొల్లూరు ప్రాంతానికి చెందిన చోడి దుర్గా చైతన్య(19), ముస్మేరి అభిలాష్(18), గడ్డం సాయివరణ్(18), వీఎస్ ఉమేష్(24), గుగులోతు దాసు(19)తో కలిసి ఒరిస్సా నుంచి అయిదు కిలోల గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారు. వీరంతా బైకులపై ఒరిస్సా వెళ్లి అక్కడి నుంచి ఈ గంజాయిని సేకరించి తీసుకొస్తున్నారు. ఇక్కడ గ్రాముల వంతున వాటిని ప్యాకెట్లుగా మార్చి అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని ఇందిరానగర్‌లోని ఒక ఇంట్లో భద్రపర్చగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. దాడిలో భాగంగా అయిదు కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయిదుగురిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురు విద్యార్థులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## తార్నాకలో రోడ్డు ప్రమాదం.. వ్యక్తి దుర్మరణం

**తార్నాక, జూలై 9 ప్రభాతవార్త :** వేగంగా బైక్‌పై ప్రయాణిస్తు డివైడర్ గోడకు ఢీకొట్టడంతో ఒకవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. లాలాపేట్ వినోభానగర్‌కు చెందిన మల్లేష్ కుమారుడు శ్రీనివాస్ (30) తన బైకుపై బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత తార్నాకకు వెళ్లి తిరిగి లాలాపేట్‌లోని ఆయన ఇంటికి వెళ్లుతున్నాడు. వేగంగా వెళ్లే క్రమంలో లాలాపేట్ ఫ్లైఓవర్ గోడకు వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంతో తీవ్రగాయాలకు గురైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## డీజిల్ చోరీ కేసులో నిందతుల అరెస్ట్

**యూసుఫ్‌గూడ, జూలై 9 ప్రభాతవార్త:** అక్రమంగా డీజిల్ దొంగతనం చేస్తూ పెద్దఎత్తున ఒక గోడౌన్‌లో దాచి ఉంచడంతో ఎస్వోటీ పోలీసులు గురువారం దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మావతినగర్‌లోని మదీనా మజీద్ దగ్గర పక్కా సమాచారంతో ఎస్వోటీ పోలీసులు ఇంటి నంబర్ 14 1 128బై, 29 బై 27 సర్వే నంబర్ 18 ప్రాంతంలో నిందితులైన మహ్మద్ మునీరుద్దీన్(28) తండ్రి సలీముద్దీన్, కిరాణా షాప్ నిర్వాహకుడు, కేతావత్ శ్రీను(23) తండ్రి లక్ష్మణ్ ఆటో డ్రైవర్, వి.రమేష్ నాయక్(27) తండ్రి ఆమర్యానాయక్ వృత్తి డ్రైవర్, సయ్యద్ ఆసీం(27) తండ్రి కలీం వృత్తి టైల్స్ పని వీరి వద్ద నుంచి డీజిల్ 1335 లీటర్లు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.50 వేలనగదు, ఫోర్డ్ ఫియస్టా కారు టీఎస్07యూఏ4510, ఎమ్‌హెచ్ 12ఎఫ్‌పీ4061లను స్వాధీనం చేసుకుని అల్లాపూర్ పోలీసులకు అప్పగించటం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఆర్‌వి కర్ణన్

## సర్‌ను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్‌వి కర్ణన్**

**జూబ్లీహిల్స్, జూలై 9, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బడా గణేష్ ప్రాంతంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాల పురోగతిని గురువారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి(ఈఆర్ఓ) ఎన్. శంకర్, సహాయ ఎన్నికల నమోదు అధికారి బి.శ్రీనివాస్, బీఎల్ఓ సూపర్‌వైజర్ సురేందర్‌తో పాటు బీఎల్ఓలు ఎం. ధర్మరాజు, కె.రేణుక, టి.బిందు, జి.షాలిని తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంచేసి, ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సకాలంలో పూర్తిచేయాలని కర్ణన్ అధికారులను ఆదేశించారు.

## తెలంగాణా ఈశాన్య రాష్ట్రాల మధ్య బంధం బలపడాలి

**తెలంగాణా లా అండ్ ఆర్డర్ డీజీపీ మహేష్ భగవత్**

**బేగంపేట, జూలై 9, ప్రభాతవార్త :** తెలంగాణా ఈశాన్య రాష్ట్రాల మధ్య సాంస్కృతిక బంధం బలపడాల్సిన అవసరం ఉందని తెలంగాణా లా అండ్ ఆర్డర్ డీజీపీ ఎం.మహేష్‌భగవత్ అన్నారు. కిమ్స్ హాస్పిటల్స్,నార్త్ ఈస్ట్ కనెక్ట్ అసోసియేషన్(నెకా) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వైద్య,విద్య,ఉద్యోగ రంగాల కోసం హైదరాబాద్‌లో స్థిరపడిన ఈశాన్య రాష్ట్రాల ప్రజల సంస్కృతిని గౌరవించి పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ డా. బి.భాస్కరరావు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో నర్సింగ్, పారామెడికల్ విభాగాల్లో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అనేక మంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారి సంస్కృతిపై అవగాహన పెంపొందించి మరింత ఆత్మీయ వాతావరణం కల్పించాడినికే ఈ సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నెకా ఉపాధ్యక్షుడు డా.సర్బేస్వర్ సహారియా, నెకా అధ్యక్షుడు పాపారావు బియ్యాల ఉపాధ్యక్షుడు గౌతమ్ సవాంగ్,స్టీఫెన్ రోనోజిత్ సేన్,బోర్డు సభ్యులు కె.రాజేశ్వరరావు,శ్రీధర్ ముప్పిడి,డా.సంబిత్ సాహు,తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



సమావేశంలో పాల్గొన్న డిజిపి మహేష్‌భగవత్, కిమ్స్ ఆసుపత్రి ఛైర్మన్



చెత్తతీయక ముందు



చెత్త తొలగించిన తర్వాత నాలా

## ఊపిరి పీల్చుకున్న ఆఘాపురా నాలా

**56 ట్రక్కుల పూడిక తీసిన హైడ్రా**

**హైదరాబాద్, జులై 9,ప్రభాతవార్త:** వ్యర్థాలతో నిండిపోయి వరద ప్రవాహానికి ఏమాత్రం అవకాశం లేకుండా ఉన్న ఆఘాపురా నాలా ఇప్పుడు ఊపిరి పీల్చుకుంది. మెషినరీ దించడానికి ఏమాత్రం అవకాశం లేకుండా ఉన్న ఈ నాలా ఇప్పుడు పూడికను వదిలించుకుంది.మెహిదీపట్నం, విజయనగర్ కాలనీ, ఏసీఘాట్స్, మల్లేపల్లి, నాంపల్లి ప్రాంతాల నుంచి వరద నీటిని మూసీకి తీసుకెళ్లే నాలా ఇది. వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయింది. వరద నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో పనికిరాని వస్తువంతా అక్కడకు చేరినట్టయ్యింది. పరుపులు, దిండులు, బెడ్‌షీట్లు, కుర్చీలు, సోఫాలకు వినియోగించే రెగ్జిన్‌తో నిండిపోయింది. దారూసలాం వద్ద కల్వర్టు దగ్గర పేరుకుపోయిన పూడిక ఫొటోలు, వీడియోలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. హైడ్రా అధికారులకు కూడా చేరాయి. అంతే మరుసటి రోజునుంచే పూడిక తీయడం మొదలు పెట్టింది హైడ్రా. మెషినరీని ఆ కాలువలోకి దించడానికి వీలు లేని పరిస్థితి. దీంతో హైడ్రా మెట్, డీఆర్ఎఫ్ బృందాలు దిగి పూడికను తొలగించాల్సిన పరి స్థితి. అక్కడ పనిచేసిన వారికి గ్లౌజులు, మోకాల వరకూ ఉండే గమ్ బూట్లు ఇలా మాస్కులు పూడికతీతకు అవసరమైన పనిముట్లు హైడ్రా అందజేసింది. పనిలో ఆటంకంగా ఉన్నాయనో.. వాటిని ధరించి పని చేయడానికి వీలు కాలేదో కాని.. వాటిని ధరించకుండా కొంతమంది పని చేశారు. ఆ ఫొటోలను కూడా మళ్లీ నెట్టింట్లో పెట్టి.. ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న సిబ్బంది అని కూడా వైరల్ చేశారు. ఇలా ఎన్ని విమర్శలు వచ్చినా.. హైడ్రా లక్ష్యం ఒక్కటే.. ఆ వరద కాలువలో పూడికను మొత్తం తొలగించాలి.. అదే లక్ష్యంగా వారం రోజులు పని చేసి మొత్తం 56 ట్రక్కుల పూడికను తొలగించింది.

దీంతో ఆ వరద కాలువకు ఊపిరి పోసినట్టయ్యింది. పూడికను అక్కడే పడేయకుండా వెనువెంటనే తరలించింది. హైడ్రా అధికారులు ఆర్ ఎఫ్‌వో జయప్రకాష్, ఎస్ ఎఫ్ వో బి. చరన్ కుమార్ ప్రతి రోజూ ఆ పనులను పరిశీలించి పర్యవేక్షించారు. ఇప్పుడు అదే ప్రాంతంలో వెళ్లేవారు, అక్కడి నివాసితులు ఆశ్చర్యపోయారు. వరద కాలువ శుభ్రంగా మారడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా సెషన్స్ జడ్జి సాయి రమాదేవి**

**హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త:**

ప్రత్యేక లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ చైర్ పర్సన్,సెషన్స్ జడ్జి కె సాయి రమాదేవి సూచించారు.న్యాయ సేవాధికారసంస్థ, హైదరాబాద్ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ సామ్ కోశీ ఆదేశాల మేరకు సభ్య కార్యదర్శి పంచాక్షరి సూచనలతో 18న మనోరంజన్ కాంప్లెక్స్, నాంపల్లి అలాగే సికింద్రాబాద్ కోర్టులలో నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్ (సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసుల పరిష్కారం) విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్ ఆధ్వర్యంలో నేడు సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ, చెక్కు బౌన్స్ కేసులను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు బదులుగా పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్‌అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదిక అని తెలిపారు. ప్రజలకు సమయం, ధనం ఆదా కావడంతోపాటు, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.



ఒలంపిక్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న పి.టి.ఉష, వాకిటి శ్రీహరి

## దేశ క్రీడా చరిత్రలో మైలురాయిగా ఒలంపిక్ భవన్

**ఐఒఎ అధ్యక్షురాలు పి.టి.ఉషా**

**సైఫాబాద్, జులై 9 ప్రభాతవార్త:** తెలంగాణ ఒలింపిక్‌భవన్ ప్రారంభోత్సవం భారత క్రీడా చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని భారత ఒలింపిక్ సంఘం(ఐఓఎ) అధ్యక్షురాలు డా. పి.టి.ఉష కొనియాడారు. గురువారం ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల, యువజన సర్వీసులు, పశుసంవర్థక, పాడి పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్లమెంట్ సభ్యులు జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండి సోని బాలాదేవి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.టి.ఉషా ప్రసంగిస్తూ తెలంగాణ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత అభినందనీయమని, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమైనవన్నారు. వాకిటి శ్రీహరి ప్రసంగిస్తూ పరిగెత్తడంలో మిల్కాసింగ్ ఆ తరువాత పి.టి.ఉషా భారతదేశ చరిత్రలో రికార్డు సృష్టించారని అన్నారు. దేశంకోసం యువత ఆడాలని , ప్రపంచంలో గుర్తింపు తీసుకురావాలని, సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

## ఫైనాన్స్ కార్యదర్శికి కోర్టు సమన్లు జారీ

**కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ**

**కంటోన్మెంట్, జూలై 9 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక సంక్షోభంలో ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన సర్వీస్ ఛార్జీలు తక్షణమే విడుదల చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.రామక్రిష్ణ తెలిపారు. గురువారం మహేంద్రహిల్స్‌లో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్రనప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై కోర్టుకు వెళ్లి వంద కోట్లు తెప్పించామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో కంటోన్మెంట్ బోర్డుకు రూ.303 కోట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.75 కోట్లు తెప్పించేందుకు కోర్టులో పిటిషన్ వేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఫైనాన్స్ కార్యదర్శి సందీప్ శుక్రవారం కోర్టుకు హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. టీపిటీ బకాయిల కోసం కోర్టులో తాను పిటిషన్ దాఖలు చేసినందుకే ఫైనాన్స్‌కార్యదర్శికి సమన్లు జారీ అయినట్లు తెలిపారు.

# నాలా ఆక్రమణలపై దృష్టిసారించాలి

**ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ భాగాయత్-రామంతాపూర్ భాగాయత్‌లో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమగ్ర క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. సీసీరోడ్లు, వీధిదీపాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రతిపాదనలపై సమీక్షించారు.ఆస్తి పన్ను అంచనాల కోసం పత్రాల పరిశీలనకు ఆదేశాలు జారీచేశారు. నాలా ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ తొలగింపుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, నాలా పరిసరాల్లో హరితహారం చేపట్టి పచ్చదనం పెంపొందించాలి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ భాగాయత్, రామంతాపూర్ భాగాయత్‌లో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, వీధి దీపాల మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంబర్‌పేట ఎస్‌టీపీ నుంచి ఉప్పల్ భాగాయత్ డిమార్ట్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అంబర్‌పేట్ ఎస్‌టీపీ వద్ద స్వాగత తోరణం ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రెవెన్యూ విభాగం ఉప్పల్ భాగాయత్, రామంతాపూర్ భాగాయత్ ప్రాంతాల్లో ఆస్తి పన్ను అంచనాలకు సంబంధించి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగం దేవేందర్ నగర్ నాలా వెంట ఉన్న అక్రమ ఆక్రమణలు, అనధికారిక వాహన పార్కింగ్‌ను వెంటనే తొలగించి నాలా మార్గాన్ని పూర్తిగా ఖాళీ చేయాలని ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ దేవేందర్‌నగర్ నాలా పరిసరాల్లో పేరుకుపోయిన నిర్మాణ కూల్చివేత వ్యర్థాలను తక్షణమే తొలగించాలని సూచించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌ను పూర్తిగా నిర్మూలించి, పునరావృతంకాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అక్రమంగా వ్యర్థాలను డంప్ చేస్తున్న వారి మూలాలను గుర్తించి కఠిన జరిమా నాలు విధించాలని స్పష్టం చేశారు.అర్బన్ బయో డైవర్సిటీ దేవేందర్‌నగర్ నాలా స్ట్రెచ్ రోడ్డు వెంట, ఉప్పల్ భాగాయత్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. నగర అభివృద్ధి, పరిశుభ్రత, వరద నివారణ, హరిత వాతావరణ పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఉప్పల్ భాగాయత్-రామంతాపూర్ భాగాయత్‌లో పర్యటిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందచేస్తున్న రాజేష్‌ఖన్నా

## సంక్షేమ పథకాలలో గంగపుత్రులకు ప్రాధాన్యతనివ్వాలి

### టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేష్‌ఖన్నా గంగపుత్ర

**హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులుగా గంగపుత్రులను గుర్తించి, నియమిత పదవులలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేష్‌ఖన్నా గంగపుత్ర విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం తెలంగాణ అమరజ్యోతి ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో తెలంగాణ ఉద్యమ కమిటీ సభ్యుడు, శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో వరంగల్ ఉమ్మడిజిల్లాకు చెందిన ఉద్యమనాయకులు, ప్రముఖ న్యాయవాది అంబటి శ్రీనివాస్ గంగపుత్ర, ప్రముఖ విద్యావేత్త దోలి సత్య నారాయణగంగపుత్రులకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గంగపుత్ర కులాన్ని తెలంగాణ ఉద్యమ సంఘంగా గుర్తిస్తూ ప్రభుత్వ నియమిత పదవులలో సంక్షేమపథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## నల్లపోచమ్మ దేవాలయ అధ్యక్షుడిగా ఆదర్ల మహేష్



శ్రీనల్లపోచమ్మ దేవాలయ కమిటీ

**చాంద్రాయణగుట్ట, జూలై 9, ప్రభాతవార్త:** గౌలిపురా సిబిబి క్వార్టర్స్ లోని శ్రీనల్లపోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా ఆదర్ల మహేష్ ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దొంకి యాదగిరి, పి.ఇమానియల్, పి.రాంమూర్తి, కె.దేవేందర్, ఎం.కుమార్, జి.ఎం.జ్యోతికుమార్, కె.ప్రభాకర్, కె.సురేందర్, ఎన్.చంద్రశేఖర్, జె.చిరంజీవి, పుప్పాల మధుసూదన్‌రావు, ఆరేపల్లి ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.పి.సురేష్ కుమార్, కోశాధికారిగా మెరుగు బ్రహ్మానందం, ప్రచార కార్యదర్శిగా ఆదర్ల సాయి సుచిత్, ఆదర్ల భార్గవ్, సాంస్కృతిక కార్యదర్శిగా పి.అమృత్ కుమార్, ఆలేటి అంజయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఆదర్ల మహేష్ మాట్లాడుతూ రానున్న బోనాల పండుగను పాలకవర్గం, బస్తీవాసుల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అంబేద్కర్ వర్సిటీలో చేరిన నటుడు రాహుల్ రామకృష్ణ



రాహుల్ రామకృష్ణకు పుస్తకాలు అందిస్తున్న ఆచార్య ఘంటా చక్రపాణి

**జూబ్లీహిల్స్, జూలై 9, ప్రభాతవార్త :** భరత్ అనే నేను చిత్రంతో గుర్తింపు పొందిన సినీనటుడు రాహుల్ రామకృష్ణ డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సులో చేరారు. విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణిని కలిశారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి రాహుల్ రామకృష్ణకు అభినందనలు తెలియజేసి బిఏ కోర్సుకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను అందజేశారు. అనంతరం రాహుల్ రామకృష్ణ మాట్లాడుతూ తాను ఇంజినీరింగ్ చదువును మధ్యలోనే నిలిపివేసి, ఇప్పుడు తిరిగి డా. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీలో చేరినట్లు తెలిపారు.

## నవీన్‌మిట్టల్‌ను కలిసిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్లు



నవీన్‌మిట్టల్‌కు పుష్పగుచ్ఛం,శాలువాతో సత్కరిస్తున్న అంజయ్య, నాసర్ షరీఫ్, అనురాధ, సిద్ధు తదితరుల

**హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త:** జెన్‌కో అకౌంట్స్ వింగ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ప్రమోషన్లకు ఇటీవల ఆమోదం లభించి ఉత్తర్వులు జారీకావడంతో, గురువారం అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఎనర్జీ) నవీన్‌మిట్టల్‌ని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా నవీన్ మిట్టల్‌కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించింది. అకౌంట్స్ వింగ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ప్రమోషన్ల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకొని ఉత్తర్వులు జారీ అయ్యేలా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రతినిధి బృందం తెలంగాణ జెన్‌కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఎస్.హరీష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించింది. అకౌంట్స్ వింగ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ప్రమోషన్ల మంజూరు నిర్ణయం అకౌంట్స్ విభాగ అధికారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమం, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యల పరిష్కారానికి ఇదే విధమైన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ అంజయ్య, నాసర్ షరీఫ్-అధ్యక్షులు, సి.హెచ్.అనురాధ, సిద్ధు, డి.శ్రీనివాస్, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పోరాటం

**చాంద్రాయణగుట్ట, జూలై 9, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకటరమణ తెలిపారు. శాలిబండ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ బస్తీలో రూ.5.99 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రమణ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బస్తీకి సరియైన రోడ్డు లేక రాకపోకలకు, వర్షాకాలంలో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి తగిన నిధులను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. అందుకు బల్దియా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు ముఖేష్ సూర్యవంశీ, ఎస్సీ మోర్చ కార్యదర్శి పవన్, గాంధీనగర్ అధ్యక్షులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు అండగా ఉంటాం

### తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి

**బేగంపేట, జూలై 9, ప్రభాతవార్త :** బాధింపబడే మహిళలకు అండగా ఉంటామని తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి భరోసానిచ్చారు. గురువారం జాతీయ మహిళా కమిషన్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మల్టీజోన్ ఫేస్ 2 ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్‌జిల్లాల సఖీ సెంటర్ల సిబ్బంది, పోలీసు, లీగల్ రిప్రజెంటేటివ్‌లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని వెంగళరావ్ నగర్‌లోని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ సంస్థ భవనాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గద్వాల విజయలక్ష్మి ప్రారంభించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతిఓజా, కమిషన్ సభ్యులు, కార్యదర్శి సిబ్బంది చైర్మన్ విజయలక్ష్మికి స్వాగతం పలికారు. రాష్ట్రంలో నలుమూలలకు మహిళా కమిషన్ సేవలను అందుబాటులోకి తీసికెళ్లేందుకు కృషిచేస్తామన్నారు. శిక్షణతోనే రక్షణ వస్తుందని, రక్షణతోనే కుటుంబం సమాజం పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలకు మరింత సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సభ్యులు కాసోజు శంకరమ్మ, శశికళయాదవ్‌రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయ్, ఉజ్మా ఆషఫ్‌షాకీర్, కార్యదర్శి పద్మజ రమణ, సైకాలజిస్ట్ గీతా చల్లా, హైదరాబాద్ లా కాలేజ్ ప్రొఫెసర్ డా. పులిపాటి శ్రీదేవి, డీఎస్పీ చరితారెడ్డి, డిఎస్‌ఎల్‌ఏ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, కమిషన్ సిబ్బంది, సంబంధిత జిల్లాల సఖీ సెంటర్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సఖీ, పోలీస్ లీగ్ రిప్రజెంటేటివ్‌లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గద్వాల విజయలక్ష్మి





ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్

## విద్యతోపాటు ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకోవాలి

### ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్

**హైదరాబాద్, జూలై 9 (ప్రభాతవార్త) :** ఉన్నత విద్యతో పాటు ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకొని ప్రతి విద్యార్థి ఆ లక్ష్యసాధనకోసం కృషిచేసినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటే షిన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ... సృజనాత్మకతను పెంచుకున్నవారికి మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మితిమీరిన సెల్‌ఫోన్ ఉపయోగం వల్ల సమయం వృధాకావడంతోపాటు మన ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతుందని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధా (ఏఐ) సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆ దిశగా తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంప్రదాయ విద్యతో పాటు అడ్వాన్స్డ్ స్కిల్ నేర్చుకోవడం ఎంతో అవసరం అన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కొత్త సాంకేతికత పై పరిజ్ఞానం, కమ్యూనికేషన్, డిజిటల్ నైపుణ్యం వంటి అంశాలలో ప్రావిణ్యం సాధిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎం. ప్రియాంకా, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రావు, డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ ఎస్ అప్పారావు, ఐసీఏఐ చైర్మన్ డి.వెంకటరాంబాబు, హెచ్ఆర్ డైరెక్టర్ గరిమా పాండే, బ్రహ్మకుమారిస్ డాక్టర్ బీకే శ్రీలత సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై టిడిపి సమర శంఖం

**చిక్కడపల్లి జూలై 9 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని బలో పేతం చేయడమే లక్ష్యంగా ముషీరాబాద్ నియోజక వర్గం రాంనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని శ్రీవెంక టేశ్వరస్వామి దేవాలయం వద్ద 'తెలుగుదేశం-ప్రజా పథం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ పి.బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో, రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు డి.చంద్రమోహన్‌గౌడ్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, సికింద్రాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నల్లెల్ల కిషోర్, నాయకులు పి.అశోక్, జి.వి.జి.నాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నా,లేకున్నా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్య మవుతుందని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని నల్లెల్ల కిషోర్ డిమాండ్ చేశారు.పి.బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాపథంలో భాగంగా రాంనగర్, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లో పర్యటించగా డ్రైనేజీ లైన్లు, ధ్వంసమైన సీసీ, బీటీ రోడ్లు, తీవ్ర నీటి ఎద్దడి, కరెంట్ కోతలు వంటి సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటి పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీడీపీ విధానాలకు ఆకర్షితులై ఐదుగురు యువకులు పార్టీలో చేరగా, వారికి నేతలు పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కె. బోసు, జి.వి.జి.నాయుడు, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర అధ్య క్షుడు పి.అశోక్ , డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్ గుప్తా, శంకర్ గౌడ్, ప్రమీల, కాసుల సుదర్శన్ రెడ్డి, తడక వినోద్, భాను ప్రకాష్, వంశీకృష్ణ,రాజేంద్రప్రసాద్, ఎం.చిత్ర, గండికోట విజయ్, మచ్ఛీందర్, బి. రాజు, రవి, సత్తన్న, భవాని శ్రీనివాస్, ఆనంద్, అనిల్, శక్తి ప్రేమ్, కాతా విజయ్, విక్రం, మల్లిఖార్జున్, యాదగిరి, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

## జోనల్ సత్యనారాయణ బృందానికి సన్మానం

**చాంద్రాయణగుట్ట, జూలై 9, ప్రభాతవార్త :**

బోనాల ఏర్పాట్లలో భాగంగా గురువారం గౌలిపురా శ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, శ్రీ కోటమైసమ్మ దేవాలయాలను జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ, డిసి సరిత బృందం సందర్శించారు. ఆలయ అధ్యక్షులు ఎర్మని కైలాష్ గంగపుత్రవారికి ఘనస్వాగతం పలికారు. శాలువతో సన్మానిం చారు. బోనాల సందర్భంగా ఆలయాల వద్ద చేపట్టాల్సిన పనులను జెడ్సి, డిసిల దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న జయేష్ రంజన్

## విద్యార్థులు నాయకత్వ లక్షణాన్నిఅలవర్చుకోవాలి

### తెలంగాణా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

**బేగంపేట, జూలై 9, ప్రభాతవార్త :** విద్యార్థినులు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా భవిష్యత్‌లో రాణించడానికి అవసరమైన నాయకత్వ పటిమ, సామాజిక బాధ్యతను కల్గి ఉండటం ఎంతో అవసరమని తెలంగాణా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు.యూనిసెఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ డా.జులాలెం బిర్హాను తఫెస్సే,కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి,తో కల్సి ఈ ప్రాజెక్టుతోపాటు ఎమర్జింగ్ ఉమెన్ లీడర్స్ప్రోగ్రాం ను లాంఛనంగా ప్రారంభించారు.దిగుడ్ టాక్ ఫ్యాక్టరీ ఫౌండేషన్, సీఎస్ఆర్ భాగస్వామి యూనిస్లింక్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది పొడుగునా సాగే విద్యా నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాన్ని విద్యార్థినుల కోసం రూపొందించారు. అకడమిక్ విద్యకు,ఉపాధి. రంగ అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేస్తూ విద్యార్థినులను వృత్తి పరంగా సిద్ధం చేసేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఇలాంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు యువతులను ఉత్తమ నిర్ణేతలుగా ధీటైన నాయకులుగా తీర్చిదిద్దుతాయన్నారు.యూనిసెఫ్ ప్రతినిధి డా.జెలాలెం బిర్హాను తఫెస్సే మాట్లాడుతూ బాలికల విద్య, నాయకత్వ రంగాల్లో పెట్టుబడి పెట్టడం వల్ల కుటుంబాలతో పాటు సమాజం,దేశం ఎంతగానో లబ్దిపొందుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి మాట్లాడుతూ ప్రాజెక్టు విద్య 3.0ద్వారా విద్యార్థినుల ఆత్మ విశ్వాసం వృత్తి పరమైన నైపుణ్యాలు,వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయన్నారు.55మంది విద్యార్థినులను ఈ శిక్షణకు ఎంపిక చేయగా వీరికి మొత్తం 15 సెషన్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో డా.జ్యోతిర్మయి, శ్వేత, రఘు, మాధురి, హిరణ్మద, ధన్‌రాజ్, పరమేశ్వర్, మహేశ్వరి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత అమరం శ్రీనివాసరెడ్డికి పితృవియోగం

**బేగంపేట జూలై 9,ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రకాశం నగర్ డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు అమరం శ్రీనివాసరెడ్డి(పటేల్) తండ్రి కృష్ణారెడ్డిపటేల్(90) అనారోగ్యంతో గురువారం ఉదయం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎన్‌డీఎంఏ ఉపాధ్యక్షులు,బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధరరెడ్డి,బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవారెడ్డిలు శ్యాంలాల్ లోని శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకుని కృష్ణారెడ్డి పార్థివ దేహం వద్ద పూల మాలలు ఉంచి నివాళులు అర్పించారు.శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులకు మర్రి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు.ధైర్యంగా ఉండాలంటూ సూచించారు.మర్రి వెంట ఉస్మాన్ ఖాన్,రమాదేవి తదితరులు ఉన్నారు.

## 'సర్' సందేహాలకు హెల్ప్ డెస్క్

### పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 9 ప్రభాతవార్త :** బాగ్‌అంబర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'సర్' హెల్ప్ డెస్క్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు,డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీ,శ్రీకాంత్‌గౌడ్ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'సర్'పై ఓటర్లకు ఉన్న సందేహాలు, సూచనలు, సలహాలు అందించారు. సర్ పత్రాలను నింపడానికి నేడు ప్రారంభించిన హెల్ప్‌డెస్క్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. మన ఓటు మన హక్కు, మన ఓటు హక్కును మనమే కాపాడుకుందాం. ఈ యొక్క సదవకాశాన్ని ప్రజలందరూ తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, డివిజన్ ప్రెసిడెంట్ రావుల సుధాకర్, పుట్ట రాకేష్, గౌడ్,చంద్రశేఖర్, అబ్బు భాయ్ సర్ప రోజ్ సైఫుల్ల తదితరులు పాల్గొన్నారు.





ఓటర్ల పత్రాలపై సందేహాలను నివృత్తి చేస్తున్న శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

# శస్త్రచికిత్సలో ప్రాయోజిత నైపుణ్యాలను అలవర్చుకోవాలి

**అత్తాపూర్ జూలై9,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లోని పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల, పశువైద్య శస్త్ర చికిత్స, రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి - షెడ్యూల్డ్ కాస్ట్ సబ్ ప్లాన్ (ఐసీఏఆర్-ఎస్‌సీ ఎస్‌పీ) ఆర్థిక సహకారంతో "చివరి సంవత్సరం బి.వి.ఎస్‌సీ ఏహెచ్ షెడ్యూల్డ్ కాస్ట్ విద్యార్థులకు మరియు క్షేత్ర పశువైద్యులకు కంపానియన్ జంతువుల ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స లో జ్ఞాన, నైపుణ్యాభివృద్ధి ద్వారా జీవనోపాధి, ఔత్సాహికతాభివృద్ధి" అనే అంశంపై ఐదు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం మొదటి శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. జ్ఞానప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో పశువైద్య విద్యార్థులు పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు శస్త్రచికిత్సలో ప్రాయోగిక నైపుణ్యాలను కూడా తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. కంపానియన్ జంతువుల వైద్యంలో పెరుగుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు స్వయం ఉపాధి దిశగా కూడా ముందుకు సాగాలని, ఇటువంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్తులో ఉత్తమ పశువైద్య నిపుణులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొ న్నారు. పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ డా. ఎం.ఉదయ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవడం ద్వారా సమర్థవంతమైన పశువైద్య నిపుణులుగా ఎదగగలరని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా. డి.మాధురి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రాయోగిక శిక్షణ అందించడం విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యమన్నారు. శిక్షణా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జె. రాధాకృష్ణారావు స్వాగతోపన్యాసంలో మాట్లాడుతూ, కంపానియన్ జంతువులలో ఆర్థోపెడిక్ సమస్యలను గుర్తించడం, నిర్ధారించడం మరియు శస్త్రచికిత్సా పద్ధతులపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఆధునిక శస్త్ర చికిత్సా విధానాలు, క్లినికల్ నైపుణ్యాలు మరియు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, 21 మంది చివరి సంవత్సరం బివిఎస్‌సీ ఏహెచ్ విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్య విశ్వవిద్యాలయంలో అధికారులు, విద్యార్థులు

## తెలుగు వర్సిటీ ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

**నాంపల్లి, జూలై 9 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ డైరెక్టర్ డా. వనజా ఉదయ్ తెలిపారు. జూలై 23న నాంపల్లి హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో బిఎస్‌ఏ, ఎంపిఏ డ్యాన్స్, ఎంపిఏ ఫోక్ ఆర్ట్స్ ఉదయం 11 నుండి 12గంటల వరకు; మధ్యాహ్నం 2 నుండి 3.30గంటల వరకు ఎంఏ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం కోర్సులలో చేరడానికి ప్రవేశ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. బిఎస్‌ఏ, ఎంపిఏ డ్యాన్స్, ఎంపిఏ ఫోక్‌ఆర్ట్స్ కోర్సులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు అదేరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో ప్రాయోగిక పరీక్షకు కూడా నిర్వహించనున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. బిఎస్‌ఏ ప్రాయోగిక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు డ్రాయింగ్‌బోర్డు, అవసరమైన పెన్సిళ్లను వెంట తీసుకొచ్చుకోవాలని సూచించారు. హాల్ టిక్కెట్లను జూలై 16 నుండి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పిఎస్‌టియు సెట్.ఆర్గ్ (ఓఆర్‌జి) వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విశ్వవిద్యాలయం వెల్లడించింది. అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని అధికారులు సూచించారు.

## ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అంతర్జాతీయ గౌరవం

**జూబ్లీహిల్స్, జూలై 9, ప్రభాతవార్త :** అంధత్వ నివారణలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల(ఎల్వీపీఈఐ)కు అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్ఓ) ఈ సంస్థను మరో నాలుగేళ్ల కాలానికి తన అధికారిక కొలాబరేటింగ్ సెంటర్‌గా తిరిగి ఎంపిక చేసుకున్నట్లు ఎల్వీపీఈఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు తెలిపారు. తొలిసారిగా 2001లో ఈ గుర్తింపు సాధించి పాతికేళ్లుగా ఈ హోదాను కొనసాగిస్తున్నామన్నారు. డబ్ల్యుహెచ్ఓ డైరెక్టర్ జనరల్ గుర్తించిన పదకొండు అత్యుత్తమ కంటి సంరక్షణ సంస్థలలో ఎల్వీపీఈఐ ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు. ఇది అత్యంత అరుదైన గౌరవమని, ఇందులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందన్నారు. ఆసుపత్రి పబ్లిక్ హెల్త్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్ ఖన్నా మాట్లాడుతూ ఒక పూర్తి ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు వివరించారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**నిజాంపేట, జూలై 9 ప్రభాతవార్త :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో ఎఐటియుసి మండల 4వ మహాసభ ఆసియాదయ్య అధ్యక్షతన నిజాంపేట్ ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. మహాసభకు మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర మున్సిపల్ సంఘం కార్యదర్శి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నం, ఎఐటియుసి ఉపా ధ్యక్షుడు పాలబిందల శ్రీనివాస్, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరినాథరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కార్మికులు పోరాటాలద్వారా సాధించుకున్న కార్మిక చట్టా లను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల రూపంలో బలహీనపరిచిందని విమర్శించారు. కార్మిక సం ఘాల హక్కులను తగ్గించే విధంగా, యాజమాన్యా లతో కార్మిక సంఘాల చర్చలకు అవకాశం లేకుండా చేసే విధానాలు అమలుచేస్తున్నారని ఆరోపించారు. అలాగే స్థిర ఉద్యోగాలకు బదులుగా కాలపరిమితి ఉద్యోగ విధానాలను తీసుకువచ్చి కార్మికుల భద్రతను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల తరఫున మాట్లాడే సంఘాలను బలహీనపరచేందుకు కుట్రపూరిత రాజకీయాలు సాగుతున్నాయని, కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించాలని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో కార్మికులందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 11న మేడ్చల్ జిల్లాలో జరిగే ఎఐటియుసి 4వ జిల్లా మహాసభలో భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేసి, కార్మికు లకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలను కొనసా గిస్తామని నాయకులు తెలిపారు. ఈ మహాసభలో దస్తగిరి, భాగ్యమ్మ, పుష్ప, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట్ ఎఐటియుసి అధ్యక్షుడిగా మేకల బాలకృష్ణ, మండల కార్యదర్శి గా ఆసియాదయ్య, కన్వీనర్‌గా దస్తగిరిని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.

## ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేయించుకోవాలి

### బిఆర్ఎస్ నాయకురాలు గంగిశెట్టి లిఖితగౌడ్



మాట్లాడుతున్న గంగిశెట్టి లిఖితగౌడ్

**హైదరాబాద్ జూలై 9 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును పదిలంగా ఉంచుకోవడంలో సర్ నమోదుప్రక్రియ అత్యంత కీలకమని, ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ అన్నారు. గురువారం నల్లకుంటలోని తన నివాసంలో ఆమె తన భర్త గంగిశెట్టి అమర్‌నాథ్‌గౌడ్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, ప్రజాస్వామ్య హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఇంటింటికి వచ్చి బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడం జరుగుతుందని, ఓటర్లు తప్పులు లేకుండా ఫారం లో తమ వివరాలను ఓటర్లు రాయాలని సూచించారు. ఈనెల 24వ తేదీ లోపు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి తిరిగి బిఎల్‌వో కు అందజేయాలన్నారు. సర్ 2002లో ఓటు ఉన్నవారు మొదటి బాక్సు కాలమ్‌లో నింపాలని ఆమె సూచించారు. 2002లో ఓటు లేనివారు వారి తండ్రి, తల్లి, తాత, నాయనమ్మల్లో ఒకరిది ఎస్ఐఆర్2002 వివరాలను రెండో బాక్సు కాలమ్ లో,ఈ రెండూ తెలియని వారు మూడో బాక్సు కాలమ్ పూరించాలని తెలిపారు.అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు ఓటర్ల కోసం నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ లోని బస్తీలు, కాలనీలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ హెల్ప్ డెస్కులలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు సర్ ఫారాలను నింపడంలో సహాయం చేస్తున్నారని ఆమె తెలిపారు.

## పద్మశ్రీలతో పరిఢవిల్లించిన తెలంగాణ ప్రజాకళ

**రవీంద్రభారతి, జూలై 9 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో జరుగుతున్న సాంస్కృతిక కళామహోత్సవం తెలంగాణ ప్రజాకళ 99వ రోజు తెలంగాణ పద్మశ్రీ కళాకారులతో పరిఢవిల్లించింది. అంతరించిపోతున్న అరుదైన జానపద కళలను తమ గుండెల్లో నింపుకుని దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మశ్రీని అందుకున్న ముగ్గురు తెలంగాణ కళామూర్తులు దాసరి కొండప్ప బుర్ర వీణానాదం; దర్శనం మొగులయ్య 12మెట్ల కిన్నెర; గడ్డం సమ్మయ్య చిందుయక్షగానంతో రవీంద్రభారతి పాల్కురికి సోమన్న వేదిక పునీతమైంది. నారాయణపేట జిల్లాకు చెందిన పద్మశ్రీ దాసరి కొండప్ప స్వయంగా తయారుచేసిన అరుదైన బుర్రవీణ వాయిద్యం తత్వాలు, జానపద గేయాలను వేళ్ల విన్యాసం, వీణ మధుర నాదంతో పరవశింపజేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పద్మశ్రీ దర్శనం మొగులయ్య తన సంప్రదాయ 12మెట్ల కిన్నెర వాయిద్యంతో పాడిన వీరుల గాథలు, జానపద గీతాలు సరికొత్త ఉత్సాహంతో నింపగా జనగామ జిల్లాకు చెందిన చిందుయక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తన బృందంతో కలిసి చిందుయక్షగాన ప్రదర్శన పౌరాణిక పాత్రల్లో వారు పలికించిన హావభావాలు, నృత్యాలు, సంభాషణలు రంగస్థలానికే వన్నెతెస్తూ మైమరపించాయి. ఈ సందర్భంగా ముగ్గురు పద్మశ్రీ కళాకారులను ఘనంగా సత్కరించారు.



తెలంగాణ పద్మశ్రీ కళాకారుల ప్రదర్శనలో దృశ్యం

## విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



గోడపత్రిక ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**హయత్ నగర్, జూలై 9 (ప్రభాతవార్త) :**
విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు జూలై 10న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ పిలుపు నిచ్చింది. ఈ మేరకు హయత్‌నగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచన ను ప్రభుత్వం తక్షణమే మానుకోవాలన్నారు. విద్యాశాఖకు ప్రత్యేకంగా ఒక మంత్రిని కేటాయించాలన్నారు. వారు కోరారు. విద్యా శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించి, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో చింత వెంకటేష్, భుక్య వినోద్ నాయక్, ఈనపల్లి ఉపేందర్, జూనోతల భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, యశోద ఆసుపత్రి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ తదితరులు

**మలక్ పేట, జూలై 9, ప్రభాతవార్త:**
రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట్ శ్రీ పోచమ్మ దేవాలయం వద్ద రూ. 29 లక్షలతో నిర్మించనున్న నూతన రోడ్డు నిర్మాణం పనులను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, నాయకులు మహమ్మద్ గౌస్, తాటికొండ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు: ఎమ్మెల్యే అహ్మద్ బలాల



మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో సువరింటెండెంట్ డాక్టర్ వీరు జాదవ్ తదితరులు

**మలక్ పేట, జూలై 9, ప్రభాతవార్త:**
మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్ ను ఆసుపత్రి వైద్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరు జాదవ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కరుణాకర్ ు పాల్గొన్నారు.

## పత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలి

### - కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులపై సమీక్ష



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన జిల్లా కలెక్టర్

**నేరేడ్ మెట్, జూలై 9, ప్రభాతవార్త :**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం అల్వాల్ మండలం కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ ప్రతిరోజూ పత్రికలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. అది విజ్ఞానాన్ని పెంచడంతో పాటు సమాజంపై అవగాహనను విస్తరిస్తుందని తెలిపారు. విద్యార్థులు వేదికపై మాట్లాడేందుకు సంకోచించకుండా తమకు అనుకూలమైన భాషలో ధైర్యంగా మాట్లాడాలని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదుల అవసరం ఉందని ప్రధానోపాధ్యాయుడు వివరించగా, మరుగుదొడ్లు, తరగతి గదులు తదితర మౌలిక వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల, గ్రంథాలయం, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులు కోరిన క్రీడా సామగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, అల్వాల్ మండల తహసీల్దార్ రాములు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# త్వరలో బండ్లగూడ చెరువు సుందరీకరణ

### కబ్జాలు ప్రోత్సహించడంతోనే ముంపు సమస్యలు



చెరువులు పరిశీలిస్తున్న మధుయాష్కీ, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జూలై 9 (ప్రభాతవార్త):**
గత బీఆర్ఎస్ పాలనలో చెరువులు, కుంటలను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేయడంతోనే నేడు నగరంలో ముంపు సమస్యలు తీవ్రంగా తలెత్తుతున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యుడు మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. నాగోల్, బండ్లగూడ చెరువుల పరిసర ప్రాంతాల ప్రజలు, ఎల్బీనగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం డైరెక్టర్ చెరుకు భవాని శంకర్‌గౌడ్ ఆహ్వానం మేరకు గురువారం ఆయా చెరువులను టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నాగోల్, బండ్లగూడ చెరువుల్లో కేవలం వరదనీరు మాత్రమే కలవాల్సి ఉండగా డ్రైనేజీ మురుగు సైతం కలుస్తుండటంతో దుర్గంధంగా మారి దోమలు, క్రిమికీటకాలు వ్యాప్తి చెంది పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్న దుస్థితి నెలకొందన్నారు. నగరంలో ముంపు సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చెరువు, కుంటల వద్ద కబ్జాలను తొలగించేందుకు హైడ్రాను ప్రవేశపెట్టిందన్నారు. చెరువు, కుంటల వద్ద కబ్జాలను తొలగించి వరదనీటితో కలకలలాడుతూ వాటి చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, ఓపెన్ జిమ్‌తో ప్రజా అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే హైడ్రా ముఖ్య ఉద్దేశమన్నారు. నాగోల్, బండ్లగూడ చెరువుల సమస్యలను ఎంఎంఏ, హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని సుందరీకరించడంతో పాటు పరిసర కాలనీలో వరద ముంపు సమస్యలను తీర్చిదిద్దేందుకు పాటుపడతానని మధుయాష్కీ ఆయా కాలనీల ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ డైరెక్టర్ చెరుకు భవాని శంకర్ గౌడ్, నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాండు లారెడ్డి, నాయకులు డాక్టర్ బి.విజయరంగ, మెట్టు రవి దర్‌గౌడ్, లింగాల కిశోర్‌గౌడ్, బుద్దా సత్యనారాయణ, శేఖర్‌రెడ్డి కృపాకర్‌రెడ్డి, చెరుకు జంగయ్యగౌడ్, చెరుకు చిరంజీవి, జహంగీర్ బాబుగౌడ్, రజినీరావు, రోజారెడ్డి, విద్యారెడ్డి, కాటమల్ల పెద్దలు, రఘువేందర్‌గౌడ్ ఉన్నారు.

**బండ్లగూడ చెరువు కింద యథేచ్ఛగా వెంచర్....**
బండ్లగూడ చెరువు కింద పరిధులు దాటి యథేచ్ఛగా వెంచర్ ఏర్పాటు చేసినా స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పట్టించుకోక పోవడమే కాకుండా అలాంటి అక్రమాలు, కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని మధుయాష్కీ తీవ్రంగా ఆరోపించారు. అలాగే చాలాచోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వి అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారన్నారు. ఈ కారణంగానే ఎల్బీనగర్లో ముంపు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

## సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పట్టు సాధించాలి

### -జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ కిషన్‌కుమార్‌రెడ్డి: పక్కన తీగల కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:**
సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పట్టు సాధిస్తేనే ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగాలు సాధించవచ్చని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒకటైన హైదరాబాద్ మీర్‌పేట్ మేడిబౌలిలోనున్న తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ / టికెఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో గురువారం 21వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఇంజనీరింగ్ కాలేజీ స్థాపన జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అదే విధంగా కాలేజీ 21వ గ్రాడ్యుయేషన్ డేను పురస్కరించుకొని టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించిన వేడుకలకు జెఎన్‌టియుహెచ్ వైస్ ఛాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌కుమార్‌రెడ్డి టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక ఛైర్మన్, హైదరాబాద్ మాజీ మేయర్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విసి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఆనుకొని సువిశాల స్థలంలో చక్కని కళాశాలలు ఏర్పాటు చేసి గడచిన 25 సంవత్సరాల కాలంగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన తీగల కృష్ణారెడ్డిని ఆయన కుమారులను అభినందించారు. ప్రపంచం నేడు సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించిందనీ ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఎఐ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నా వాటి వల్ల అనర్థాలు కూడా జరుగుతున్నందున అప్రమత్తత అవసరమని ఆయన హెచ్చరించారు. ఇంజనీరింగ్ తర్వాత సరైన నైపుణ్యాలు లేకుండానే విదేశాలకు వెళ్తే ఇబ్బందులు కలుగుతాయని ఆయన వెల్లడించారు. వివిధ దేశాల్లో వారి భాషపై అవగాహన పెంచుకొంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఉద్యోగ అవకాశాలు సాధించే విధంగా కోర్సులను తీసుకువస్తున్నామని ఆయన వెల్లడించారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ రంగాల్లో పట్టు సాధిస్తే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన సూచించారు. కాలేజీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దే ఆశయంతో 2000 సంవత్సరాలో తన స్వగ్రామంలో కాలేజీని ప్రారంభించామని గుర్తు చేశారు. 25 సంవత్సరాల్లో నేడు వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంబిఎ, ఫార్మసీ, డిప్లొమాలను పూర్తి చేసి మన దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో స్థిరపడ్డారని వెల్లడించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు కాలేజీకి, తల్లిదండ్రులకు పేరు వచ్చే విధంగా స్థిరపడాలని ఆయన కోరారు. అనంతరం విసి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, తీగల తులసి అమర్‌నాథ్‌రెడ్డి, హరితారెడ్డి, టికెఆర్‌సి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామస్వామి రెడ్డి, టికెఐఎం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి మురళి మోహన్, కాలేజీల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డమీది లక్ష్మీనర్సింహారెడ్డి, పలువురు హెచ్ఓడిలు, లెక్చరర్లు, విద్యార్థులు,పాల్గొన్నారు.

## ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాల పంపిణీ



పాత్రలు పంపిణీ చేస్తున్న తోట మహేష్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త:**
చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం చైతన్యపురి డివిజన్ పరిధిలోని పలకాలనీలలో ఎస్ఐఆర్ పాత్రలను ఓటర్లకు పంపిణీ చేశారు. డివిజన్ పరిధిలోని న్యూమారుతినగర్, ఫణిగిరి కాలనీలలో సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి పలు బూతులలో ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ ఓటర్లకు పత్రాలను పంపిణీ చేశారు. ఎస్ఐఆర్ కు సంబంధించి ఓటర్లకు ఉన్న పలు అనుమానాలను వారు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి కాలనీ అధ్యక్షులు కృష్ణ మూర్తి, న్యూమారుతినగర్ మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి, మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ బిఎల్ఓలు, చైతన్యపురి బిఎల్ఎలు శ్రీశైలంయాదవ్, రమేశ్, వెంకటేష్, శ్రీకాంత్, బాలు, సాయి పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఎస్ఐఆర్ విజయవంతం కోసం సహకరించాలి

### డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య

**సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతం కావడానికి అఖిల పక్ష నాయకులు సహకరించాలని డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య కోరారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు/ప్రతినిధులతో డిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి పూర్తిగా వివరించారు. ఈ మేరకు రాజకీయ పార్టీల వారు లేవనెత్తిన సందేహాలు, ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. సర్ ప్రక్రియ విజయవంతం కోసం రాజకీయ పార్టీల వారు, బిఎల్ఓలు తదితరులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లు ఏ విధంగా పూర్తి చేయాలో ఆయన అవగాహన కల్పించారు. నిర్దేశిత కేంద్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి కలర్ పాస్ పోర్టు అతికించి అక్కడే అందజేయవచ్చని డిసి తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా అక్కడే ఉండే అధికారులు, సిబ్బంది, వాలంటీర్లను అడిగి ఓటర్లు నివృత్తి చేసుకోవచ్చని ఆయన అన్నారు. అందరూ సమన్వయంతో పని చేస్తే సర్కిల్‌లో ఎస్ఐఆర్ విజయవంతం అవుతుందని సమ్మయ్య తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**హయత్ నగర్, జూలై 9ప్రభాత వార్త :** అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథణం ప్రకారం వివరాలు... పెద్ద అంబర్‌పేట్ నుండి పసుమాముల వెళ్లే దారిలో శ్మశానవాటిక సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ కాశిరెడ్డి, సీఐ శంకరయ్య, డీఐ సంతోష్ కుమార్ పరిశీలించారు. మృతుడు 20 25 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని వారు తెలిపారు. మృతుడి ముఖం, శరీరంలోని ఇతర భాగాలపై గాయాల ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో భాగంగా మృతుడు పసుమాముల గ్రామానికి చెందిన సుహాస్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

**హైదరాబాద్ జూలై9,ప్రభాతవార్త :** కొత్వాల్‌గూడ డివిజన్119 బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ జోనల్ కమిషనర్ మరియు డిప్యూటీ కమీషనర్ ని కలిసి డివిజన్119 పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలైన ఆర్‌బీ నగర్, మధురా నగర్, సిద్ధాంతి ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు, రాళ్లగూడ ప్రధాన రోడ్డుపై నిరంతరం డ్రైనేజీ నీరు పొంగిపొర్లడం,తదితర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

## కార్మిక నేత చెవ్వ సతీష్ కుమార్ మృతి

**సైదాబాద్ జూలై 9 ప్రభాతవార్త:**
టిఎన్ టి యు సి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కార్మిక నేత చెవ్వ సతీష్ కుమార్ గురువారం సైదాబాద్ లోని ఆయన స్వగృహంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఉమ్మడి రాష్ట్రంలో టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షుడిగా, జలమండలి కామ్ గార్ యూనియన్ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. మలక్ పేట నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన రెండు పర్యాయాలు మలక్ పేట నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం టిఆర్ఎస్ కు రాజీనామా చేశారు. ఇటీవల ఆయన సతీమణి, కుమారుడు అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటినుండి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కాగాసీనియర్ కార్మిక నేత సి. సతీష్ కుమార్ అకాల మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన సీనియర్ కార్మిక నేత సతీష్ కుమార్ అకాల మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కు గౌరవ అధ్యక్షులుగా సి. సతీష్ కుమార్ సేవలందిస్తున్నారని ఆయన గుర్తు చేసారు.

## మతం మారాలన్న ఒత్తిడితోనే దంపతుల ఆత్మహత్య...!

### పోలీసుల విచారణలో వివరాలు వెల్లడించిన కుమారులు



రవికుమార్, శిరీష దంపతులు

**హయత్ నగర్, జూలై 9 ప్రభాతవార్త :**
ఈ నెల 2న ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న రవికుమార్, శిరీష దంపతుల కేసులో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వారు ఆత్మహత్య చేసుకోవడానికి పక్కింటి దంపతులే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. మతం మార్చుకోవాలని వారు ఒత్తిడి చేయడం అది కుదరకపోవడంతో పెట్టుబడి పేరుతో రూ20లక్షలు తీసుకొని రిటర్న్ ఇవ్వకపోవడం వంటి కారణాలతోనే రవికుమార్ దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. రవికుమార్, శిరీష ల ఆత్మహత్య అనంతరం వారి కొడుకులు సుశాంత్, విద్వాన్స్‌లతో పాటు శిరీష తల్లిదండ్రులను పోలీసులు విచారించే సమయంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.మత మార్పిడి విషయమై ఇంట్లో గొడవలుబియ్యం వ్యాపారం చేసుకుంటూ, సొంత ఇల్లు కొనుక్కొని ఇద్దరు కుమారులతో సంతోషంగా ఉంటున్న కుటుంబంలో పక్కింటి దంపతులు మతం మార్పిడి పేరుతో చిచ్చు పెట్టారు. పక్కింట్లో ఉంటున్న వెంకట్, ప్రమీల కుటుంబంతో రవికుమార్, శిరీషకు మంచి పరిచయం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని వెంకట్, ప్రమీలలు రవికుమార్ ఇంటికి వచ్చిన ప్రతీసారి మతం మార్చుకుని ప్రతీ ఆదివారం చర్చికి రావాలని ఒత్తిడి చేసేవారు. మృధు స్వభావి అయిన రవికుమార్ అప్పుడప్పుడు తన భార్య శిరీషతో కలిసి వెంకట్ మాట కాదనలేక ప్రార్థనకు వెళ్లేవారు. అయినా తమ మతంలోకి రావాలని వెంకట్, ప్రమీల దంపతులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. మతం మారడం తనకు ఇష్టం లేదని శిరీష తెగేసి చెప్పింది. రవి కుమార్ మతం మారుదాం అంటూ భార్యకు నచ్చజెప్పేవాడు. ఈ క్రమంలో వారి మధ్య అప్పుడప్పుడు వారిరువురి మధ్య వాగ్వాదం జరిగేది.20లక్షలు పెట్టుబడి పెట్టించిరవికుమార్ దంపతులకు మతం మారడం ఇష్టం లేదని గుర్తించిన వెంకట్, ప్రమీల దంపతులు.. మరో పథకం వేశారు. రెడీమిక్స్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని వారిని నమ్మించారు. ఎలాగూ మతం మారలేదు కదా.. కనీసం పెట్టుబడి పెడదామని రవికుమార్ దంపతులు నిర్ణయించుకున్నారు. రెడీమిక్స్ వాహనం కొనుగోలు చేసేంత వరకు వెంకట్, ప్రమీల దంపతులు వారిని వదిలిపెట్టలేదు. వాహనం కొంటే ప్రతి నెలా రూ.20వేలు ఆదాయం ఇంటికి వస్తుందని నమ్మబలికారు. దాంతో రవికుమార్ తన భార్య నగలను తాకట్టుపెట్టి రూ.20 లక్షలతో వాహనం కొని వెంకట్ ప్రమీలకు అప్పగించారు. రూ.20 వేల చొప్పున రెండు, మూడు నెలలు మాత్రమే ఇచ్చి ఆ తర్వాత ఇవ్వడం మానేశారు. దీంతో బ్యాంకులో ఉన్న బంగారానికి వడ్డీ కట్టలేక పోతున్నామని రవికుమార్, శిరీష మదనపడ్డారు.ఓవైపు పెట్టుబడి నష్టం మరోవైపు ఒత్తిడి తట్టుకోలేక పక్కింటి దంపతులతో గొడవ పెట్టుకోలేక, వారి పైశాచికత్వాన్ని భరించలేక రవికుమార్ దంపతులు సొంతిల్లు ఖాళీ చేసి వేరే చోటుకు మారాలని నిర్ణయించుకున్నారు. సామాన్లను మూటలు కట్టి పెట్టారు. అంతలోనే ఏమి జరిగిందో జులై 2న ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోకి వెళ్లారు. ఆత్మహత్యకు ముందు పక్కింటి వెంకట్‌తో సుమారు అరగంట సేపు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసుల విచారణతో తేలింది. ఆ తర్వాత రవికుమార్, శిరీష దంపతులు ఒకరినొకరు హత్తుకొని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వారు చనిపోయిన విషయం తెలిసిన వెంటనే పక్కింట్లో ఉండే వెంకట్, ప్రమీల దంపతులు ఇంటకి తాళం వేసి పరారయ్యారని పోలీసులు తెలిపారు.

## మల్కాజ్‌గిరిలో 22ఎ నిషేధిత జాబితాకు వ్యతిరేకంగా ధర్నా

### -ధర్నాకు హాజరుకావాలని కెటిఆర్‌ని ఆహ్వానించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్‌గిరి, జూలై 9, ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని పలు కాలనీల సర్వే నంబర్లను 22ఎ నిషేధిత జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లను నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సమస్యపై ప్రజల తరఫున బలమైన పోరాటం చేపట్టేందుకు మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమానికి హాజరై ప్రజలకు అండగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కే.టి. రామారావు (కేటీఆర్) గారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 22ఎ నిషేధిత జాబితా కారణంగా వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. తమ సొంత ఆస్తులను కొనుగోలు చేయడం, విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సాధ్యంకాక ప్రజలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నేరేడ్మెట్, ఆర్‌కే పురం, డిఫెన్స్ కాలనీ, మోలాలి, గౌతమ్ నగర్, మల్కాజ్‌గిరి తదితర ప్రాంతాల్లోని అనేక కాలనీలు 22తి నిషేధిత జాబితాలో ఉండటంతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే 22ఎ నిషేధిత జాబితాను పునః సమీక్షించి, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కాలనీలను ఆ జాబితా నుంచి తొలగించి యథావిధిగా రిజిస్ట్రేషన్లు జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఈ సమస్యపై ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించి 22ఎ నిషేధిత జాబితాను ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని మరిం త ఉద్ధృతం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



వనస్థలిపురం డివిజన్ బి.జె.పి. అధ్యక్షుడు కాటం క్రాంతిగౌడ్ జన్మదిన వేడుకలు వనస్థలిపురం లోని శ్రీ మహంకాళి అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి.రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి తో పాటు పలువురు బి.జె.పి.శ్రేణులు క్రాంతిగౌడ్ ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. (ప్రభాతవార్త.. వనస్థలిపురం.).

## అల్వాల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్‌గిరి, జూలై 9, ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుని మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అల్వాల్ ప్రాంతంలో జనాభా, రిజిస్ట్రేషన్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అల్వాల్‌లో ప్రత్యేక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే, రాష్ట్రవ్యాప్తంగా అమల్లో ఉన్న 22ఎ నిషేధిత జాబితాను ఉపసంహరించుకొని, ఆ జాబితా కారణంగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక కార్యదర్శిని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్య వల్ల వేలాది మంది భూ యజమా నులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ అంశాలపై స్పందించిన రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ఐఏఎస్ ఎమ్మెల్యే వినతిని సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై అవసరమైన చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.